సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



సోమశిలలో 52.438 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 52.438 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 830, ఉత్తరకాలువకు 100, దక్షిణకాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.96,880
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.8,746
3శాతం జీఎస్టీతో	రూ.9,008
నవర (8గ్రా)	రూ.72,064

గరిష్ఠం/కనిష్ఠం
37.3 /27.1

వాతావరణం

జిల్లాలో మంగళవారం అక్కడక్కడ తేలిక పాటి జల్లులు పడొచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 66 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

- 10 సవర్ల బంగారం, 5 కిలోల వెండి, రూ.3 లక్షల నగదు అపహరణ



చెల్లాచెదురు చేసిన వస్తువులు

కందుకూరు: పట్టణంలోని వాసవీనగర్‌లో తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని దొంగలు భారీ చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. బాధితుడి సమాచారం మేరకు.. వాసవీనగర్‌కు చెందిన మోటుమర్రి కోటేశ్వరరావు మ్యారేజ్ మీడియేటర్‌గా పనిచేస్తున్నారు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనానికి వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకునే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దుస్తులు, వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. 10 సవర్ల బంగారం, 5 కిలోల వెండి, రూ.3 లక్షల నగదు అపహరించినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు.

వెబ్‌సైట్‌లో సీనియార్టీ జాబితా

నెల్లూరు (టౌన్): జిల్లాలో సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ తుది జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు స్కూల్ అసిస్టెంట్ నుంచి హెడ్‌మాస్టర్ పదోన్నతి కోసం జాబితాను కూడా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 17వ తేదీలోపు తగిన ధ్రువపత్రాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బెగ్గింగ్ మాఫియా





చంటి బిడ్డలకు మత్తు మందు ఇచ్చి మహిళలతో యాచన

నెల్లూరులోని బస్టాండ్ సెంటర్లు, రద్దీ ప్రదేశాల్లో కొందరు ఆడ, మగ పసిపిల్లలు ఒక చేయి చాచి మరో చేయిని కడుపుపై పెట్టుకుని దీనంగా యాచిస్తుంటారు. మరి కొన్ని చోట్ల యువతుల నుంచి నడివయస్సు మహిళల వరకు జోలి కట్టుకుని అందులో చంటి బిడ్డలను పెట్టుకుని భిక్షాటన చేస్తుంటారు. అయ్యో.. పసి పిల్లలు, చంటి బిడ్డలతో ఉన్న మహిళలు కదా అని ఎవరైనా జాలిపడి ఐదో.. పదో ఇస్తారు. ఇదంతా వారి కోసం వారు భిక్షాటన చేయడం లేదు. వీరితో ఈ విధంగా బెగ్గింగ్ మాఫియా చేయిస్తోంది. వీరిని పర్యవేక్షిస్తున్న బృందం ఎప్పటికప్పుడు వచ్చిన కలెక్షన్ మొత్తం తీసుకుంటుంటారు. సాయంత్రానికి వీరికి పదో పరకో ఇచ్చి పంపిస్తుంటారు.

- పసి పిల్లలతోనూ ఇదే పని చేయిస్తున్న వైనం
- పడారుపల్లి, ఇందిరమ్మకాలనీల్లో పాగా వేసిన ముఠాలు
- భిక్షాటన చేసే మహిళల పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

నెల్లూరు (పొగతోట): నెల్లూరు నగరంలో బెగ్గింగ్ మాఫియా రోజు రోజుకు విస్తరిస్తోంది. రద్దీ కూడళ్లు, బస్టాండ్ సెంటర్లలో పసి పిల్లలు, చంకలో చంటి బిడ్డలతో మహిళలతో భిక్షాటన చేయిస్తూ ఆ సొమ్ములో వారికి భిక్షం వేస్తున్నారు. పడారుపల్లి, ఇందిరమ్మ కాలనీలో కొన్ని ముఠాలు ఈ తరహా వ్యాపారం చేస్తున్నాయి. ఈ ముఠాలు చంటి బిడ్డలను కిడ్నాప్ చేసి తీసుకువచ్చిన వారితోపాటు సంచార గిరిజనులు, పూటగడవని పేదల పిల్లలను అద్దెకు తీసుకువచ్చి ఈ బెగ్గింగ్ మాఫియాను నడుపుతున్నట్లు సమాచారం. సంచార జాతులకు చెందిన కొందరు యువతుల నుంచి నడి వయస్సు మహిళలకు ఈ చంటి బిడ్డలను ఇచ్చి యాచన చేయిస్తున్నారు. ఆ బిడ్డలు వీరి ఒడిలో ఉన్నంత సేపు ఏడవకుండా వారికి మత్తు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇది అత్యంత దారుణం. ఇదే విషయం ఇటీవల ఐసీపీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీం) అధికారుల విచారణలో బయటపడింది.

200 మందికిపైగా మహిళలతో..

నగరంలో సుమారు 200 మందికి పైగా మహిళలు చంటి బిడ్డలతో, వందల సంఖ్యలో బడీడు పిల్లలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు యాచించడం చేయిస్తున్నారు. ఈ బెగ్గింగ్ మాఫియా ఎంతటి దారుణానికి తెగిస్తుందంటే.. చంటి బిడ్డలు మహిళల జోలిలో నిద్రపోయే విధంగా మత్తులో ఉండేటట్లు వారికి పాలల్లో మత్తు కలిపి ఇస్తున్నారు. దీంతో వీరు సాయంత్రం వరకు ఆకలి వేసినా ఉలకరు. పలకరు. మానవత్వం మరిచి చంటి బిడ్డలకు మత్తును ఇస్తున్నారని ఐసీపీఎస్ అధికారులకు తెలిసినా మొక్కుబడిగా కేసులు పెట్టి వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలనీ ప్రాంతాల నుంచి మహిళలు పసి పిల్లలను తీసుకువచ్చి భిక్షాటన చేస్తున్నారు. వీరి వెనుక మాఫియా వ్యక్తులు ఉన్నారు. వీరు యాచించిన మొత్తం తీసుకుని ఆ మహిళలకు కొంత ఇస్తున్నట్లు సమాచారం. మహిళలు తీసుకు వస్తున్న పసి పిల్లల్లో అధిక శాతం మంది బయట ప్రాంతాల నుంచి కిడ్నాప్ చేసి తీసుకొచ్చినట్లు సమాచారం. కొంత మంది తమ సొంత పిల్లలను సైతం తీసుకువచ్చి బెగ్గింగ్‌కు పాల్పడుతున్నారు. నగరంలో అయ్యప్పగుడి దగ్గర నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు యాచించే మహిళలు అధికంగా ఉన్నారు. ఇటీవల ఐసీపీఎస్ అధికారులు భిక్షాటన చేస్తున్న కొందరు పిల్లలను పట్టుకుని వారితో భిక్షాటన చేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. పిల్లలను హోమ్‌లో చేర్పించి వారికి విద్యా బుద్ధులు, మంచి దుస్తులు, ఆహారం అందిస్తున్నారు.



భిక్షాటన చేస్తున్న వారి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

ప్రాణాలు కోల్పోయిన పసి పిల్లలు

మహిళలు పసిపిల్లలను తీసుకు వచ్చి నగరంలో బెగ్గింగ్ చేయించే క్రమంలో ఇటీవల అనారోగ్య కారణాలతో ఇద్దరు పసి పిల్లలు మరణించినట్లు సమాచారం. ఆ పిల్లలు అనాథలు కావడంతో ఈ విషయం బయటకు రాలేదు.

కేసులు పెట్టినా మారని మహిళలు

మహిళలను యాచక వృత్తి నుంచి బయటకు తీసుకు వచ్చేందుకు పసి పిల్లలను పాఠశాలలకు పంపించేందుకు బాలల సంరక్షణ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పసి పిల్లలకు మత్తు మందు ఇచ్చి బెగ్గింగ్ చేయిస్తున్న మహిళలపై కేసులు నమోదు చేశారు. కోర్టులో విచారణ జరుగుతోంది. కేసులు నమోదు చేసినా మహిళల్లో ఎటువంటి మార్పు రావడం లేదు. యాచక వృత్తిలో ఈజీగా మనీ వస్తుండడంతో దానిని వదిలి మహిళలు బయటకు రాలేకపోతున్నారు.

➡ ఇందిరమ్మ కాలనీకి చెందిన (పేరు మార్పు) నారాయణ, అంకమ్మ దంపతులు వృత్తి రీత్యా గ్యాస్ రిపేర్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదుగురు పిల్లలు. వీరంతా బడీడు పిల్లలే. భార్యాభర్తలకు గొడవలు కావడంతో భర్త భార్యాబిడ్డలను వదిలేసి వెళ్లాడు. దీంతో బతుకుదెరువు పేరుతో పిల్లల అమ్మమ్మ వారిని తీసుకెళ్లి మార్కెట్ సెంటర్, వీఆర్‌సీ సెంటర్లో భిక్షాటన చేయిస్తోంది.

➡ ఇందిరమ్మ గిరిజన కాలనీకి చెందిన నాగవేణి, వెంకయ్య తమ ముగ్గురు పిల్లలతో భిక్షాటన చేయిస్తున్నారు. వచ్చిన డబ్బుతో మద్యం తాగి జల్సాలు చేస్తున్నారు.

➡ అయ్యప్పగుడి ప్రాంతానికి చెందిన నర్సింహులు, లక్ష్మీదేవి ముగ్గురు పిల్లలను తీసుకొచ్చి భిక్షాటన చేయిస్తున్నారు. నర్సింహులు దివ్యాంగుడు కావడంతో పిల్లలు తీసుకొచ్చే డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇలాంటి వారు నగరంలో చాలా మందే ఉన్నారు.



రద్దీ ప్రదేశాల్లో యథేచ్ఛగా..

ఆర్టీసీ బస్‌స్టేషన్, ఆత్మకూరు బస్టాండ్ సెంటర్లు, స్టోన్‌హౌస్‌పేట, రైల్వేస్టేషన్, వేదాయపాళెం, అయ్యప్పగుడి, మినీబైపాస్, మాగుంట లేఅవుట్ తదితర ప్రాంతాల్లో మహిళలు పసి పిల్లలను తీసుకొచ్చి యాచిస్తున్నారు. ఆగి ఉన్న బస్సుల్లోకి మహిళలు ఎక్కి ప్రయాణికుల నుంచి నగదు అడుగుతున్నారు. ప్రధాన కూడళ్లు, హోటళ్లు, టీ షాపులు, ఇతర దుకాణాల వద్ద మహిళలు చిన్న పిల్లలు బెగ్గింగ్‌కు పాల్పడుతున్నారు.

కేసులు పెట్టినా మార్పు రావడం లేదు

నగరంలో పసిపిల్లలు, బడీడు పిల్లలతో బెగ్గింగ్ అధికంగా జరుగుతోంది. రెండు నెలల కాలంలో బెగ్గింగ్‌కు పాల్పడుతున్న మహిళలపై కేసులు నమోదు చేశాం. అయినా వారిలో మార్పు రావడం లేదు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. మహిళలకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి యాచక వృత్తిని మాన్పించేలా చర్యలు తీసుకుంటాం.

– సురేష్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని వ్యతిరేకించాలి

- తిరుపతి ఎంపీ గురుమూర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, చిత్రంలో ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): దేశ వ్యాప్తంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని జరుపుకుంటున్న తరుణంలో రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలువుతుందని, మేధావులు, విద్యావంతులు ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న పాలకులు, పోలీసులకు రాబోయే రోజుల్లో అది వారి మెడకు చుట్టుకుంటుందని హెచ్చరించారు. నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలిసి ఎంపీ గురుమూర్తి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఎలాంటి ఆధారాలు లేకుండానే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమన్నారు. గిరిజనులను బెదిరించి కాకాణిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. న్యాయస్థానాల మీద తమకు నమ్మకం ఉందని కాకాణి కోర్టును ఆశ్రయిస్తే ఈలోపు ఈ పాలకులు తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అసలు టీడీపీ నేతలే పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ చేస్తూ రాష్ట్ర ఖజానాకు గండి కొడుతున్నారన్నారు. ఏపీలో పరిశ్రమలు మూత పడడానికి ఈ ప్రభుత్వ సంస్కరణలే కారణమన్నారు. అక్రమ కేసులకు, నిర్బంధాలకు వైఎస్సార్‌సీపీ క్యాడర్, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదన్నారు.

టీటీడీ గోశాల ఆవుల మృతిపై విచారణ జరపాలి

తిరుపతిలోని టీటీడీ గోశాలలో ఉన్న గోవుల మృతిపై మాజీ ఎమ్మెల్యే, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పినవన్నీ వాస్తవాలేనన్నారు. టీటీడీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. అఖిల పక్షాన్ని తీసుకెళ్లి గోశాలను పరిశీలించేందుకు అనుమతులివ్వాలని డిమాండ్ చేశారు. తిరుమలలో ప్రధాన పూజలు అందుకునే గోవు, దూడలు, ఎద్దు మృతి చెందాయన్నారు. సాక్షాత్తు సీఎం ఎదుటే టీటీడీ ఈఓ, చైర్మన్ వాదులాడుకుంటుంటే అక్కడ ఏ మాత్రం పాలన ఉందో అర్థమవుతుందన్నారు. భూమన హిందువో, నాస్తికుడో తెలియాలంటే ఆయన ఇంటికి వెళ్తే తెలుస్తుందని, ఈ అంశంపై వాదనలు అనవసరమన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్దేశ పూర్వకంగా ప్రతిపక్షంపై దుష్ప్రచారాలు చేస్తోందన్నారు. అన్ని అంశాలపై అఖిల పక్షంను ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఎస్టీ వర్గీకరణతోనే యానాదుల ప్రగతి

- సింహపురిలో కదంతొక్కిన యానాదులు
- యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావం
- సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లూరు చినపెంచలయ్య



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న యానాది రిజర్వేషన్ పోరాట సమితి

నెల్లూరు(బృందావనం): ఎస్టీ వర్గీకరణతోనే యానాదుల అభివృద్ధి సాధ్యమని యానాది రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరు చినపెంచలయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రంలో యానాదుల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా యానాదులు అభివృద్ధి చెందాలంటే వర్గీకరణ తప్పదన్నారు. యానాదుల ఎస్టీ వర్గీకరణ చేపట్టాలంటూ సోమవారం నెల్లూరు నగరంలో 'ఎస్టీ వర్గీకరణ భేరీ' చేపట్టారు. సుబేదారుపేట నుంచి పురమందిరం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. చినపెంచలయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా యానాదుల బతుకుల్లో ఎటు వంటి మార్పు రాలేదన్నారు. విద్య, ఉద్యోగ, రాజ కీయ రంగాల్లో యానాదులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 37 లక్షల గిరిజన జనాభాలో 10 లక్షల మందికిపైగా యానాదులు ఉన్నారన్నారు. వారికి బడ్జెట్‌లో కనీస కేటాయింపులు జరగడం లేదని వివక్షకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలోనే ఉమ్మడి ఎస్టీ రిజర్వేషన్లను కూడా తక్షణమే వర్గీకరించి యానాదులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూన్‌లో సీఎం చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె నుంచి ఎస్టీ వర్గీకరణ సాధన యాత్రను ప్రారంభించి రాష్ట్రమంతటా పర్యటించి అమాయక ఆదిమ జాతి గిరిజనులైన యానాదులను చైతన్యవంతం చేస్తామన్నారు. యానాది రాష్ట్ర ఉద్యోగ సంఘం అధ్యక్షుడు చేవూరు సుబ్బారావు సభకు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో యానాది సంఘం రాష్ట్ర నేతలు మేకల శ్రీనివాసులు, చలంచర్ల పెద్దబ్రహ్మయ్య, బాపట్ల బ్రహ్మయ్య, పొన్నూరు అంకమ్మరావు, చందేటి ఉష, పోట్లూరు హనుమంతరావు, రాపూరి కృష్ణయ్య, మురళి, రవీంద్ర, వరలక్ష్మి వివిధ జిల్లాలకు చెందిన ఆ సంఘ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, యానాదుల నేతలు పాల్గొన్నారు.

వెన్నెలకంటికి నివాళి

తొలుత నక్కలోళ్ల సెంటర్‌లో ఉన్న వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లోని వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అక్కడి నుంచి ర్యాలీ పురమందిరం వరకు సంప్రదాయ డప్పునృత్యాలు, కీలుగుర్రాల ఆటలతో, జానపద గీతాలతో వందలాదిగా యానాదులు తరలి వచ్చారు. పురమందిరంలోని వెన్నెలకంటి రాఘవయ్య, బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



మాట్లాడుతున్న చినపెంచలయ్య



గాంధీబొమ్మ సెంటర్‌ను దిగ్బంధించి నిరసన తెలియజేస్తున్న ముస్లింలు

వక్ఫ్ సవరణ చట్టం మాకొద్దు

- నెల్లూరులో ముస్లింల భారీ ర్యాలీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా హోరెత్తిన నినాదాలు
- గాంధీబొమ్మ సెంటర్ దిగ్బంధం

నెల్లూరు (బృందావనం): కేంద్రం మొండిగా అమల్లోకి తెచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించమంటూ ముస్లింలు గర్జించారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారత రాజ్యాంగ పరిరక్షణ కమిటీ, వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం నెల్లూరు నగరంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలో కొన్ని గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. దేశాన్ని కాపాడతామంటూ కేంద్ర ప్రభుత్వం ముస్లింలను అణచివేయడానికి వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరించిందని మండిపడ్డారు. ఒకరి ఇంట్లోకి బలవంతంగా దూరి ఆ ఇంట్లో వారిని రక్షిస్తామన్న విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అందుకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని ధ్వజమెత్తారు. నగరంలోని కోటమిట్ట షాదీమంజిల్ నుంచి బయలుదేరిన ఈ భారీ ర్యాలీ గాంధీబొమ్మ వరకు భావోద్వేగపూరితంగా జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వక్ఫ్ చట్ట సవరణలో జరిగిన అన్యాయాలపై ఎలుగెత్తి చాటుతూ నినాదాలు చేస్తూ ర్యాలీగా కొనసాగారు. గాంధీబొమ్మ సెంటర్‌ను దిగ్బంధించారు. ఈ సందర్భంగా కొందరు ముస్లిం నేతలు మాట్లాడారు.

కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తున్నాం

ముస్లింల మనోభావాలను దెబ్బతీస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన కొత్త వక్ఫ్‌బోర్డు చట్టాన్ని ఒప్పుకోబోమని భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మౌలానా మొహ్మద్ ఇలియాస్ స్పష్టం చేశారు. ఇతర మతస్తులను వక్ఫ్ బోర్డులో నియమించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ముస్లింలను అణగ దొక్కేందుకే ఈ చట్టాన్ని తెచ్చిందన్నారు. తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

చంద్రబాబు ముస్లింల ద్రోహి

సీఎం చంద్రబాబు ముస్లింల ద్రోహి అని, లక్షలాది మంది ముస్లింలు ఓట్లేస్తే గెలిచి దొంగబుద్ధితో ముస్లింలను రోడ్డు మీదకు లాక్కొచ్చాడని వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత సమీర్‌ఖాన్ మండిపడ్డారు. ఓటేసిన వారికి ఇలా ద్రోహం చేయడం చంద్రబాబుకు అలవాటే అన్నారు. చంద్రబాబు, పవన్, బీజేపీ దేశం మొత్తం మీద ముస్లింలపై కుట్రలు చేస్తున్నారన్నారు. నల్ల చట్టాలకు కాలం చెల్లిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా ముస్లిం వ్యతిరేక చట్టాలకు రూపకల్పన చేస్తోందని విమర్శించారు.

హిందు, ముస్లింల మధ్య చిచ్చు పెట్టడమే

కేంద్రం అమల్లోకి తెచ్చిన వక్ఫ్ చట్టంతో అన్నదమ్ములుగా ఉన్న హిందువులు, ముస్లిం మధ్య కూటమి ప్రభుత్వం చిచ్చు పెట్టిందని బారాషహీద్ దర్గా ఇమామ్ సయ్యద్ అబూబకర్ అష్రఫి ఆవేదన వ్యక్తం చేశారు. కుట్ర పూరితంగా ముస్లింల హక్కులను కాలరాస్తూ, వారికి చెందిన ఆస్తులను ఆక్రమించుకోవడానికి చేస్తున్న కుట్రగా ఉందన్నారు. 1995 వక్ఫ్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ అభివృద్ధి పేరుతో ఈ నల్లచట్టాన్ని తయారు చేసిందన్నారు. హడావుడిగా ఆమోదించడం, ముస్లిం సమాజ అభ్యంతరాలను ఏ మాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గం, విచారకరమన్నారు.

వెంటనే రద్దు చేయాలి

ముస్లిం సమాజానికి నష్టం కలిగించే ఈ వక్ఫ్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, వక్ఫ్ సవరణ చట్టం ముస్లిం సమాజానికి ప్రమాదకరమని హాజీ ఇంతియాజ్ అన్నారు. ఈ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముస్లింల వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన విధంగానే ఇతర మతాల ఆస్తులకు సంబంధించి రాజ్యాంగ బద్ధమైన అనుమతి ఉందని, కానీ బీజేపీ ప్రభుత్వం వాటి జోలికి వెళ్లకుండా ముస్లింల వక్ఫ్ ఆస్తులను మాత్రమే లక్ష్యంగా చేసుకుందన్నారు.

మిత్రపక్షాల మౌనం సరికాదు

ముస్లిం సమాజానికి ద్రోహం చేసే వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేస్తున్న కేంద్రంలోని బీజేపీకి మిత్రపక్షాలు మద్దతు పలకడం సరికాదని జేఏసీ కమిటీ సభ్యులు సయ్యద్ నవీద్‌అహ్మద్, జాకీర్, షకీల్, సర్దార్, అబ్దుల్‌గని, అన్వర్‌బేగ్, అబ్దుల్‌కరీం విచారం వ్యక్తం చేశారు. 11 మంది ముస్లిం సభ్యులు ఉండాల్సిన సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్లో ఏడుగురు ముస్లిమేతరులు సభ్యులుగా ఉండడం దారుణమన్నారు. మిగిలిన నలుగురిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు ముస్లిం పురుషులు సభ్యులుగా ఉండే అవకాశం ఉందన్నారు. ఇది వినాశకరమైన చట్టమన్నారు. కేంద్రం పునరాలోచన చేసి ముస్లిం సమాజానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



నెల్లూరులో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఇది నా అడ్డా!

- కాలం చెల్లిన మైన్‌ను అడ్డుపెట్టుకుని తవ్వకాలు
- చెలరేగిపోతున్న నెల్లూరుకు చెందిన ప్రజాప్రతినిధి
- గతంలో ఉన్న మెటీరియల్ పేరుతో అనుమతులు
- బయట తవ్వి అదే పర్మిట్లతో తరలింపు
- గుర్రుమంటున్న స్థానిక కూటమి నేతలు
- కన్నెత్తి చూడని అధికారులు



మైన్‌కు సమీపంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గూడూరు మండలం, చెన్నూరులో మూతపడిన శ్రీనివాస మైన్‌ని అడ్డం పెట్టుకుని నెల్లూరుకు చెందిన ఓ ప్రజాప్రతినిధి చెలరేగిపోతున్నారు. స్థానిక కూటమి నేతలను పక్కకు నెట్టి తన రాజకీయ పలుకుబడితో దందా సాగిస్తున్నారు. ఈ క్రమంలోనే ముందుగా మైన్‌లో ఉన్న ఖనిజాన్ని తరలించేందుకు పర్మిట్లు పొందారు. ఆపై ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి అక్కడ సేకరించే తెల్లరాయిని సదరు మైన్‌కి తరలించి గ్రేడింగ్ చేస్తున్నారు. తర్వాత ఎంచక్కా టిప్పర్ల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నాలుగు నెలలుగా కొన్నివేల టన్నుల క్వార్ట్జ్ ఖనిజం తరలిస్తున్నా అటువైపు కన్నెత్తి చూసేందుకు ఏ ఒక్క అధికారీ సాహసించకపోవడం గమనార్హం.

కూటమి నేతల స్కెచ్

శ్రీనివాసా మైన్‌ని సాకుగా చూపి క్వార్ట్జ్ ఖనిజాన్ని కొల్లగొట్టేందుకు కూటమి నేతలు స్కెచ్ వేశారు. ఇందులో భాగంగానే సదరు మైన్‌కు సంబంధించి ఓ భాగస్వామిని పక్కకు నెట్టి అందులో ఉన్న మెటీరియల్‌ను తరలించేందుకు సిద్ధమయ్యారు. ఆ భాగస్వామి కోర్టును ఆశ్రయించినా అతన్ని కాదని స్థానిక ప్రజాప్రతినిధి అండతో కొందరు కూటమి నేతలు తవ్వకాలకు తెగబడ్డారు. విషయం తెలుసుకున్న నెల్లూరుకు చెందిన ఓ పెద్ద ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. తన అనుచర గణంతో అక్కడ పాగా వేశారు. ముందుగా సదరు మైన్‌లో ఉన్న మెటీరియల్‌ను తరలించేందుకు రాష్ట్ర స్థాయిలో పైరవీలు చేసి అనుమతి పొందారు. ఆపై మైన్‌కు దగ్గరగా ఉన్న ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు చేపట్టి అక్కడ సేకరించిన తెల్లరాయిని అదే మైన్‌కి తరలించి గ్రేడింగ్ చేస్తున్నారు. పాత మెటీరియల్ కింద రోజూ కనీసం పది టిప్పర్లకు తక్కువ లేకుండా క్వార్ట్జ్ ఖనిజాన్ని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత నాలుగు నెలలుగా ఈ దందా సాగుతోంది.

ఆధారాలిచ్చినా అడ్డుకోవడమేనా?

శ్రీనివాస మైన్‌ను అడ్డం పెట్టుకుని అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని, దీనికి సబంధించిన ఆధారాలను నాలుగు రోజుల క్రితం గూడూరు డీఎస్పీ, సబ్ కలెక్టర్‌కు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అందించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతాన్ని సందర్శించేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ఆయన అధికారులను అభ్యర్థించారు. దానికి అప్పట్లో సదరు అధికారులు ఒప్పుకొన్నట్టుగా మిన్నకుండిపోయారు. ఆపై మేరిగ మైన్ వద్దకు బయలుదేరే సమయంలో అనుమతి లేదంటూ మెలిక పెట్టి హౌస్ అరెస్ట్‌కు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న అక్రమార్కులు మైన్‌లో ఉన్న చిన్నచిన్న వాహనాలను సైతం రాత్రికి రాత్రే తరలించేశారు. బ్లాస్టింగ్ సైతం ఆపేశారు.

తప్పు కాదా?

మైనింగ్ విషయంలో నెల్లూరుకు చెందిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. అయితే కూటమికి చెందిన ఓ నేత కళ్లెదుటే తవ్వకాలు జరుపుతున్నా ఆయనపై ఎలాంటి చర్యలకు పూనుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రాష్ట్ర కమిటీలో జిల్లా ఉద్యోగులు



ఉద్యోగులకు సన్మానం

నెల్లూరు(క్రైమ్): ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అండ్ హెడ్‌కానిస్టేబుల్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో ఉమ్మడి జిల్లాలోని ముగ్గురికి చోటు దక్కింది. ఆదివారం గుంటూరులోని ఎన్జీఓ కల్యాణ మండపంలో జరిగిన ఎన్నికల్లో నెల్లూరు ఎక్సైజ్ స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.కృష్ణయ్య రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా, ఎస్కే అజీజ్‌బాషా ఆర్గనైజింగ్ సెక్రటరీగా, గూడూరు కానిస్టేబుల్ ఎ.శ్రీరాములు జోనల్ సెక్రటరీగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మార్నెళ్ల కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సిబ్బందిని ఎక్సైజ్ అధికారులు అభినందించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	రూ.105
సన్నవి	రూ.80
పండ్లు	రూ.50



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	117
లేయర్ (లైవ్)	100
బ్రాయిలర్ చికెన్	210
బ్రాయిలర్ స్కిన్‌లెస్	232
లేయర్ చికెన్	170

నెల్లూరు: మూలాపేట వేణుగోపాలస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు



కనుల పండువగా రథోత్సవాలు

జిల్లాలోని వివిధ ఆలయాల్లో కొద్దిరోజులుగా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రథోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. భక్తులు పోటీ పడి రథాలను లాగారు. తొలుత పూజా కార్యక్రమాలను జరిపారు. ఉత్సవాల సందర్భంగా సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



మనుబోలు: సంగమేశ్వర బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం



వింజమూరు: చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా వింజమూరు పురవీధుల్లో రథోత్సవం

బంగారం, వెండి చోరీ

నెల్లూరు సిటీ: గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారు నగలు, వెండి వస్తువులను చోరీ చేశారని బాధితులు సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. రూరల్ పరిధిలోని నవలాకులతోటలో ఉన్న ద్వారకా నగర్‌లో ఉమా మహేశ్వరరావు కుటుంబం నివాసం ఉంటోంది. వారు ఇటీవల ఊరికెళ్లి ఆదివారం తిరిగొచ్చారు. ఇంటి తలుపులు తీసి ఉండగా లోపలికి వెళ్లి పరిశీలించారు. బీరువాలోని నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు, పావుకిలో వెండి వస్తువులు చోరీ చేశారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ జీవితం భావితరాలకు స్ఫూర్తి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం భావితరాలకు స్ఫూర్తి. విద్యార్థులు ఆయన్ను ఆదర్శంగా తీసుకుని సమాజానికి మంచి చేయాలి' అని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహ సముదాయంలో అంబేడ్కర్ జయంతిని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆనంద్, జేసీ కార్తీక్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పలు ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 62 హాస్టళ్లల్లో రూ.9.32 కోట్లతో మరుగుదొడ్లు, మరమ్మతులు, ఇతర వసతుల కల్పనకు పనులు ప్రారంభించామన్నారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్ కుసుమ కుమారి, రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూఓ ఖాసిం గుడ్డ సంచులను, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అంబేడ్కర్ జీవిత చరిత్రపై భారత్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు, ఏఎస్‌డబ్ల్యూఓ హజరత్తయ్య పాల్గొన్నారు.



ఇరుకైన ప్రదేశంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం

ఇలాగేనా చేసేది?

అంబేడ్కర్ జయంతిని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హాస్టల్ ఇరుకు గదిలో తూతూమంత్రంగా నిర్వహించారని విమర్శలు వెల్లువెత్తాయి. మహోన్నత వ్యక్తి జయంతిని చిన్నపాటి స్టడీ హాల్లో నిర్వహించడాన్ని పలువురు తప్పు పట్టారు. బహుమతులు తీసుకోవడానికి వెళ్లేందుకు విద్యార్థులు కష్టపడాల్సి వచ్చింది. కార్యక్రమానికి వచ్చిన వారిలో కొందరు గది బయటే ఉన్నారు. దీనికితోడు ప్రభుత్వం ఈ కార్యక్రమాలకు నిధులు ఇవ్వలేదంటూ వార్డెన్ల వద్ద డబ్బులు వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది. హాస్టల్ వెలుపల విశాలమైన స్థలం ఉన్నా అక్కడ ఏర్పాట్లు చేయకుండా ప్రభుత్వ ఆదేశాలంటూ నామమాత్రంగా హాల్లో కార్యక్రమాన్ని జరిపించడం ఏమిటంటూ ప్రజా సంఘాల నాయకులు బాహాటంగా విమర్శించారు.

కుమారుడిని కాలేజీలో వదిలి ఇంటికెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో భర్త దుర్మరణం
- భార్యకు తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో రామయ్య మృతదేహం

పొదలకూరు: ఆ దంపతులిద్దరూ తమ కుమారుడిని నెల్లూరులోని శ్రీచైతన్య కాలేజీలో వదిలి పెట్టి తిరిగి స్వగ్రామానికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. సోమవారం జరిగిన ఈ ఘటనలో భర్త అక్కడికక్కడే దుర్మరణం చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చేజర్ల మండలం చిత్తలూరు గ్రామానికి చెందిన బండి రామయ్య (35), బండి శ్రీవాణి దంపతులకు ఇద్దరు సంతానం రామయ్య ఊర్లో చేనేత మగ్గం నేస్తూ ఇటీవల బ్రాందీ షాపులో పనికి చేరి జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు ఇంటర్ పరీక్షలు రాశాడు. ఫలితాల్లో ఆశించిన మార్కులు రాకపోవడంతో ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకున్నాడు. తల్లిదండ్రులు, కుమారుడు మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వచ్చారు. కుమారుడిని కాలేజీలో వదిలిన ఆ దంపతులు ఇతర పనులు చక్కబెట్టుకుని ఇంటికి బయలుదేరారు. పొదలకూరు మీదుగా చిత్తలూరు వెళ్తుండగా పట్టణానికి సమీపంలో స్వర్ణ లేఅవుట్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ధాన్యం లోడుతో పొదలకూరు నుంచి నెల్లూరుకు వెళ్తున్న లారీ రామయ్య దంపతులను ఢీకొంది. దీంతో రామయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందగా శ్రీవాణి తలపై తీవ్రగాయమైంది. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ వచ్చి ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించింది. మరో గంటలో ఇంటికి చేరాల్సి ఉండగా ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. రామయ్య హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు పోయేవి కాదని స్థానికులు చెబుతున్నారు. ఎస్సై ఎస్కే హనీఫ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా చైతన్యంతోనే అగ్నిప్రమాదాల నివారణ

- జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ప్రజా చైతన్యంతోనే అగ్నిప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వి.శ్రీనివాసరెడ్డి అన్నారు. నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని జిల్లా అగ్నిమాపక కార్యాలయంలో సోమవారం వారోత్సవాలను డీఎఫ్‌ఓ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అజాగ్రత్తతోనే అగ్నిప్రమాదాలు సంభవిస్తాయన్నారు. ప్రమాదాలపై సమాచారం అందిన వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. విధి నిర్వహణలో ఏ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించినా జరిగే నష్టం స్వల్పంగా ఉంటుందని, తాము నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే భారీ నష్టం జరుగుతుందన్న విషయాన్ని నిత్యం గమనంలో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీ వరకు అన్ని వర్గాల ప్రజలను చైతన్యం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. షాపింగ్ మాల్స్, ఆస్పత్రులు, థియేటర్లు, ఎల్‌పీజీ గోదాములు, పెట్రోల్ బంక్‌లు, పరిశ్రమల్లో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. అగ్నిమాపక శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫైర్ ఫైటింగ్ అండ్ రెస్క్యూ ఎక్విప్‌మెంట్ స్టాల్‌ను సీనియర్ లీడింగ్ ఫైర్‌మెన్‌లు మస్తానయ్య, హరిబాబు, వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తొలుత అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో జె.ఉదయ్‌భాస్కర్‌రావు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు వారోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఎఫ్‌ఓ ఎస్.వేణుగోపాలరావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ల ప్రదర్శన

దూసుకొచ్చిన మృత్యువు

- కారు ఢీకొని ఇద్దరి మృతి
- రాపూరులో విషాదం

రాపూరు: కారు రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఇద్దరిని పొట్టనపెట్టుకుంది. ఈ ఘటన రాపూరులో విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం.. రాపూరుకు చెందిన గంధం సరస్వతమ్మ (46) సోమవారం తమ తోట వద్ద వదిలిపెట్టాలని గార్లపాటి సురేష్ (26)ను కోరింది. దీంతో ఇద్దరూ మోటార్‌బైక్‌పై తోట వద్దకు వెళ్లారు. అక్కడ బైక్ దిగుతుండగా కారు వేగంగా వచ్చి వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో పారిపోతుండగా స్థానికులు పట్టుకుని అప్పగించినట్టు పోలీసులు పేర్కొన్నారు. వారిని రాజంపేట విద్యానగర్‌కు చెందిన రామచంద్ర, మల్లికార్జునగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట్‌రాజేష్ తెలిపారు.



సురేష్ మృతదేహం



సరస్వతమ్మ (ఫైల్)

హత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కారు డ్రైవర్ హత్య కేసులో తొమ్మిది మంది నిందితులను నెల్లూరు దర్గామిట్ట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వివరాలను ఇన్‌స్పెక్టర్ రోశయ్య వెల్లడించారు. ప్రగతినగర్ ఏ బ్లాక్‌కు చెందిన డి.వాసు (22)ను ఈనెల 10వ తేదీ అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు కొందరు దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని చెత్తకుప్పలో పడేశారు. మృతుడి తండ్రి మాధవ ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితులు లేక్‌వ్యూ కాలనీకి చెందిన కె.వినయ్, వెంగళరావ్‌నగర్‌కు చెందిన కె.బాలమణికంఠ, బుజబుజనెల్లూరుకు చెందిన ఛత్రపతి అలియాస్ లోకేశ్, జి.వెంకటతేజ, ఎన్.సతీష్, ప్రగతినగర్‌కు చెందిన రౌడీషీటర్ ముక్తియార్, షేక్ సల్మాన్, కసుమూరుకు చెందిన తౌహిద్, కొత్తూరుకు చెందిన షేక్ ఆదిల్‌గా గుర్తించి సోమవారం బట్వాడిపాళెం వద్ద అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వాసుతో ఏర్పడిన వివాదాలు, పాతగొడవలను మనసులో పెట్టుకుని అంతమొందించాలని నిందితులు నిర్ణయించుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి వాసుని బలవంతంగా ద్విచక్ర వాహనంపై ఎక్కించుకుని ప్రగతినగర్ ఏ బ్లాక్‌లోని మసీదు వద్దకు తీసుకెళ్లారు. కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. నిందితుల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని..

- బాలుడి మృతి



చేతన్‌రెడ్డి (ఫైల్)

దుత్తలూరు: ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని బాలుడు మృతిచెందిన ఘటన దుత్తలూరు సెంటర్ సమీపంలోని రెస్ట్ ఏరియా ప్రాంతంలో 565వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. దుత్తలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి – జ్యోతి దంపతుల పెద్ద కుమారుడు అన్నంరెడ్డి చేతన్‌రెడ్డి (13) దుత్తలూరు గ్రామం నుంచి రెస్ట్ ఏరియా ఎదురుగా తన తండ్రి నిర్వహిస్తున్న కేఫ్ వద్దకు స్కూటీపై బయలుదేరాడు. జాతీయ రహదారి దాటే క్రమంలో ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి బెంగళూరుకు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వేగంగా స్కూటీని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాదం నెలకొంది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు.

రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందాలి



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, చిత్రంలో పర్వతరెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందాలి. ఇందుకు సరైన రాజకీయ వ్యవస్థ అవసరం' అని తిరుపతి ఎంపీ గురుమూర్తి అన్నారు. నగర వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. గురుమూర్తి, పార్టీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కలిసి బాబాసాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి ధృడమైన రాజ్యాంగాన్ని అందించారన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనను అమలు చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తోందన్నారు. వారి అరాచకం ఎంతోకాలం సాగదన్నారు.

కండలేరులో 46.661 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 46.661 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

నేత్రదానం



సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

నెల్లూరు(అర్బన్): బోగోలు మండలంలోని జువ్వలదిన్నె గ్రామానికి చెందిన కొత్తూరు వెంకట బాలాజీ (22) సోమవారం మృతిచెందాడు. అభయం స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు శ్రీవాణి సహకారంతో కుటుంబ సభ్యుడు కొత్తూరు సుబ్బారావు బాలాజీ నేత్రాలను జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుడి నేత్రాలను సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు.

యువతి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు భగత్‌సింగ్ కాలనీకి చెందిన ప్రేమ్ అనే యువతి ఇంటి నుంచి ఆదివారం అదృశ్యమైంది. బాధిత కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించారు. జాడ తెలియకపోవడంతో బాధిత తల్లి కృష్ణవేణి సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుప్పిని వేటాడిన కేసులో..

- వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(అర్బన్): దుప్పిని వేటాడి చంపిన కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్‌ఓ) మహబూబ్‌బాషా తెలిపారు. సోమవారం నగరంలోని జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. నెల్లూరు రేంజ్ సైదాపురం మండలంలోని చాగణం గ్రామానికి చెందిన సరాల సాయిరాం అనే వ్యక్తి అడవిలో దుప్పిని వేటాడి దాని మాంసాన్ని ఇంట్లో ఉంచినట్లు సమాచారం అందుకున్న అటవీ శాఖ రేంజర్ మాల్యాద్రి తన సిబ్బందితో తనిఖీలు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారన్నారు. మాంసాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పూర్తి స్థాయిలో విచారించి సాయిరాంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. కార్యక్రమంలో రేంజర్ మాల్యాద్రి, సెక్షన్ ఆఫీసర్ లోకేశ్, బీట్ ఆఫీసర్లు విజయ్, శ్రావణ్, గిరిజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ఉదయగిరి: ఉపాధి పనులకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం మండలంలోని దాసరపల్లి గ్రామ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామ సమీపంలో ఉన్న నీటికుంటలో కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఏపుగా పెరిగిన చెట్లు తొలగిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని చెట్లకు నిప్పు పెట్టారు. దీంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగ కమ్ముకోవడంతో పొలంలో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేశాయి. ఈ ప్రమాదంలో సుమారు పదిమంది వరకు గాయపడ్డారు. క్షేత్రసహాయకుడు యూనస్ వారిని చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.